క్లుప్తంగా

దత్తాత్రేయస్వామికి విశేషపూజలు



దత్తాత్రేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ, అర్చకులు

శ్రీశైలంటెంపుల్: లోకకల్యాణం కోసం శ్రీశైల దేవస్థానం గురువారం ఆలయ ప్రాంగణంలోని త్రిఫల వృక్షం కింద వెలసిన శ్రీదత్తాత్రేయస్వామికి దేవస్థానం ఈఓ, అర్చకులు విశేషపూజలను నిర్వహించారు. పూజా కార్యక్రమాలు నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతి పూజ జరిపించారు. అనంతరం దత్తాత్రేయస్వామికి అభిషేకాది, అర్చనలు చేసి ప్రసాద వితరణ గావించారు.

కుమారస్వామికి షష్టి పూజలు

శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురువారం షష్టిని పురస్కరించుకుని ఈఓ ఎస్ లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామివారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

అక్కిరాజు కాలనీలో చోరీ



చెల్లాచెదురుగా పడేసిన దుస్తులు

ఆత్మకూరు: పట్టణంలోని అక్కిరాజు కాలనీలో గురువారం వేకువజామున చోరీ జరిగింది. ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపిన మేరకు వివరాలు.. కాలనీలో నివసిస్తున్న ప్రభుత్వ ఉపాధ్యాయుడు అజాంఖాన్ వేసవి సెలవులు కావడంతో హైదరాబాద్‌లో ఉన్న తమ బంధువుల ఇంటికి వెళ్లారు. తిరిగి గురువారం వేకువజామున హైదరాబాద్ నుంచి ఆత్మకూరు చేరుకుని ఇంటికి వెళ్లగా తాళం పగులగొట్టి ఉండడం గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువా తీసి, చెల్లాచెదురుగా పడిన దుస్తులను చూశారు. బీరువాలోని 3 తులాల బంగారు గొలుసు, 80 తులాల వెండి , రూ.లక్షన్నర నగదు చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. అదే వీధిలోని మరో ఇంట్లోకూడా చోరీకి విఫల యత్నం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చెప్పారు.

శైవక్షేత్రాలను సందర్శించిన రైల్వేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్



సంగమేశ్వరంలో వేపదారు శివలింగానికి పూజలు చేస్తున్న దృశ్యం

కొత్తపల్లి: మండలంలోని శైవక్షేత్రాలైన సంగమేశ్వరం, కొలనుభారతిదేవి క్షేత్రాలను రైల్వేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ కుటుంబ సమేతంగా గురువారం సందర్శించారు. ముందుగా సప్తనదుల సంగమేశ్వరాలయంలో వేపదారు శివలింగానికి నదిజలాలతో అభిషేకం, పుష్పార్చన, కుంకుమార్చన తదితర విశేషపూజలు నిర్వహించారు. అనంతరం కొలనుభారతి దేవి క్షేత్రాన్ని చేరుకొని అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసుకున్నారు. అక్కడ ఉన్న సప్తశివాలను సందర్శించి దర్శించుకున్నారు. అనంతరం శివపురం గిరిజన గూడెం వద్ద గిరిజనులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. వీరివెంట తహసీల్దార్ చంద్రశేఖర్ నాయక్, పీఓఎల్ఆర్ డీటీ పెద్దన్న, వీఆర్వోలు మౌలాలి, బాబుమియా పాల్గొన్నారు.

వెదురు బొంగుల స్వాధీనం

వెలుగోడు: నల్లమల అటవీ ప్రాంతంలో అక్రమంగా వెదురు బొంగులు తరలిస్తుండగా అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. గురువారం రేంజ్ పరిధిలోని బేస్ క్యాంపు సమీపంలో ఐదుగురు వ్యక్తులు సైకిళ్లపై వెదురు బొంగులు తరలిస్తుండగా అటవీ అధికారులను చూసి వారు సైకిళ్లు వదిలి పరారు అయ్యారు. వెలుగోడు రేంజ్ అధికారి ఎంఏ ఖాన్, సిబ్బంది వారి కోసం గాలించగా అచూకీ లభ్యం కాలేదు. వెదురు బొంగులు, సైకిళ్లను అటవీ సిబ్బంది కార్యాలయానికి తరలించారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోండి

ఆత్మకూరు : ఎంతో చరిత్ర కలిగిన తపాలా శాఖ ఆధ్వర్యంలో అందిస్తున్న సేవలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కర్నూలు పోస్టల్ అసిస్టెంట్ డైరెక్టర్ సురేష్‌కుమార్ కోన్నారు. పట్టణంలోని పోస్టాఫీసును గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర పభుత్వం ప్రవేశపెట్టిన మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్, పీఎస్ఐ, ఆర్‌సీఎల్ఐ లాంటి పథకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని చెప్పారు. అలాగే ఇతర పోస్టల్ సేవలైన ఆర్డీ లాంటి పథకాలు కూడా ఉపయోగించుకుని తపాలా శాఖ అభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ సూపరిండెంట్ న్యామతుల్లా, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ రాఘవేంద్ర, పోస్టమాస్టర్ మహబూబ్‌బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

దండిగా ఎరువులు

- జిల్లాలో ఈ సీజన్‌కు 1.92 లక్షల మెట్రిక్ టన్నులు ఎరువులకు ప్రతి పాదనలు
- ప్రస్తుతం అందుబాటులో 1.43 మెట్రిక్ టన్నులు
- ఇప్పటికే దుకాణాల్లో 60 వేలు, ఆర్బీకేల్లో 83,245 మెట్రిక్ టన్నుల నిల్వలు
- సహకార సొసైటీ ద్వారా విక్రయాలు

నందికొట్కూరు: ఖరీఫ్ సీజన్‌కు ముందే వ్యవసాయానికి అవసరమైన ఎరువులను రాష్ట్ర ప్రభుత్వం అందుబాటులో ఉంచింది. జిల్లాలో మే నెలలోనే వర్షాలు కురవడంతో ముందస్తుగా వ్యవసాయం మొదలైంది. గత ప్రభుత్వ హయాంలో జిల్లాలో సాగు విస్తీరణ చాలా తక్కువ అయిన, ఎరువుల కొరత రైతాంగాన్ని పట్టి పీడించేది. గతంతో పోల్చుకుంటే..జిల్లాలోని గడిచిన మూడేళ్లలో ఖరీఫ్, రబీ సీజన్లలో మూడింతల సాగు విస్తీరణ పెరిగింది. ఇందుకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ఎరువులను సిద్ధం చేసింది.

2.29 హెక్టార్లలో పంటలు సాగయ్యే అవకాశం

జిల్లాలో 2023 ఖరీఫ్ సీజన్ ముందస్తుగానే ప్రారంభమవుతుండంతో ఇప్పటికే సాగు విస్తీరణం అంచనాకు అనుగుణంగా విత్తనాలు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ తాజాగా అవసరమైన మేరకు ఎరువులు కూడా సరఫరా చేస్తోంది. జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సాగు విస్తీరణం 2.27లక్షల హెక్టార్లు కాగా ఈ ఏడాది 2.29 హెక్టార్ల వరకు సాగుచేసే అవకాశం ఉంది. దీంతో ఖరీఫ్‌కు ముందుగానే ఎరువుల నిల్వలు ఉంచాలని ప్రభుత్వం ఆదేశాల మేరకు వ్యవసాయశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. సాగు చేస్తున్న రైతులకు ఈ నెల 16వ తేదీ నుంచి 60,595 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయి.

రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా

నంద్యాల జిల్లా వ్యాప్తంగా 411 రైతు భరోసా కేంద్రాలు, నందికొట్కూరు, ఆత్మకూరు సబ్ డివిజన్లలోని 96 ఆర్బీకేల ద్వారా గ్రామాల్లోని రైతులకు ఎరువులను సరఫరా చేస్తున్నారు. జిల్లాలో ఆర్బీకేలు, ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 99 సహకార కేంద్రాల ద్వారా ఎరువుల విక్రయాలు జరుగుతున్నాయి. జిల్లాలో 83,245 మెట్రిక్ టన్నుల వరకు ఎరువులు ఆర్బీకేల్లో అందుబాటులో ఉన్నాయి. జిల్లా వ్యవసాయశాఖ అనుబంధంగా ఉన్న మార్క్‌ఫెడ్ సంస్థ పరిధిలోని సొసైటీల ద్వారా కూడా రైతులకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా వివిధ రకాల ఎరువులు సరఫరా చేస్తునట్లు అధికారులు చెబుతున్నారు.



10 బొల్లవరంలోని సొసైటీలో నిల్వ ఉన్న ఎరువులు

సబ్‌డివిజన్	యూరియా	డీఏపీ	కాంప్లెక్స్	ఎస్ఎస్‌పి	పొటాష్	మొత్తం	ఆర్బీకేలు
నందికొట్కూరు	3,065	925	3,587	74	113	8,070	49
ఆత్మకూరు	7,325	1,433	5,538	97	199	13,560	47

రైతులకు అందుబాటులో..

నందికొట్కూరు, ఆత్మకూరు వ్యవసాయ సబ్‌డివిజన్లలో అన్ని రకాల ఎరువులు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది ఖరీఫ్ సాగు చేస్తున్న రైతులకు ఎరువుల సమస్య రాకుండా రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేశారు.

సీఎం జగనన్న రైతులకు అండగా నిలిచారు



వ్యవసాయం చేసేందుకు రైతులకు ఎరువులు సమృద్ధిగా ఉన్నాయి. రైతు భరోసా కేంద్రాల నుంచి అన్ని రకాల ఎరువులను అందించేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న అండగా నిలిచారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎస్ఎస్‌పి, పొటాష్ ఎరువులు ఖరీఫ్ సీజన్‌కు ముందే రైతు భరోసా కేంద్రాల్లో నిల్వ చేశారు. టీడీపీ పాలనలో ఎరువుల కోసం రోడ్లెక్కి ధర్నాలు చేశాం. అప్పటి ప్రభుత్వం అరకొర మందులిస్తే, బ్లాక్‌లో కొనుగోలు చేసి పంటలకు వేశాం.
– వెంకటేష్, శాతనకోట

జగనన్నకు రుణపడి ఉంటాం



ఎరువులను గ్రామంలోని రైతు భరోసా కేంద్రాల ద్వారా అందిస్తున్న సీఎం వైఎస్ జగనన్నకు రుణపడి ఉంటాం. గతంలో మండల, నియోజకవర్గ కేంద్రాల్లోని దుకాణాల వద్ద ఎరువుల కోసం పడిగాపులు ఉండాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకుండా గ్రామంలోనే ఆర్బీకేల ద్వారా కావాల్సిన ఎరువులు అందించిన సీఎం జగనన్నను మరవలేం.
– హుసేన్‌బాషా, బండి ఆత్మకూరు రైతు

ఎరువుల కొరత ఎక్కడా లేదు

జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఎరువుల పుష్కలంగా ఉన్నాయి. అవసరమైన మేరకు జిల్లాకు వచ్చాయి. ఆర్బీకేల్లో83,245 మెట్రిక్ టన్నుల నిల్వ ఉంది. ఫర్టిలైజర్స్ దుకాణాల్లో 60,595.78 మెట్రిక్ టన్నులు రైతులకు అందుబాటులో ఎరువులు ఉన్నాయి. జిల్లాలో మొత్తం కలిపి 1.43 లక్షల మెట్రిక్ టన్నుల వరకు ఖరీఫ్ సీజన్‌కు నిల్వ ఉన్నాయి.
– మోహన్‌రావు, జేడీ వ్యవసాయశాఖ

వడ్డెమానులో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

నందికొట్కూరు రూరల్ : మండల పరిధిలోని వడ్డెమాను గ్రామంలో ఈ నెల 27, 28వ తేదీలలో జిల్లా స్థాయి పురుషుల ఓపెన్ టు ఆల్ కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సగినేల సుబ్బన్న తెలిపారు. గ్రామంలోని పరిశుద్ధ మత్తయి దేవాలయం పదో వార్షికోత్సవం సందర్భంగా ఈ పోటీలను నిర్విహిస్తున్నట్లు వారు తెలిపారు. పోటీలలో పాల్గొనాలనుకునే వారు 27వ తేదీలోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా రూ.30 వేలు, రూ.20వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులను దాతల సహకారంతో అందజేయనున్నట్లు తెలిపారు.

నేడు పగిడ్యాల మండల సర్వసభ్య సమావేశం

నందికొట్కూరు: పగిడ్యాల మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ వెంకటరమణ తెలిపారు. పగిడ్యాల మండల కేంద్రంలోని మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో నిర్వహించే సమావేశానికి ఆయా శాఖల అధికారులు సమగ్ర సమాచారంతో హాజరు కావాలన్నారు.

ఇన్‌చార్జ్ ఎస్ఐగా బాధ్యతల స్వీకరణ

కొత్తపల్లి: మండల ఇన్‌చార్జ్ ఎస్ఐగా హుస్సేన్‌బాషా గురువారం కొత్తపల్లి పోలీసు స్టేషన్లో బాధ్యతలు స్వీకరించారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ముబీనాతాజ్‌ను అన్నమయ్య జిల్లాలో రిపోర్ట్ తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. ఇయన ప్రస్తుతం ఆత్మకూరులో రెగ్యులర్ ఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు.

ప్రజల దాహార్తి తీర్చడమే ధ్యేయం





పైప్‌లైన్‌కు భూమి చేస్తున్న మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి, వలంటీర్‌ను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

నందికొట్కూరు: పట్టణ ప్రజల దాహార్తి తీర్చడమే ప్రభుత్వ ధ్యేయమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణ సమీపంలోని మద్దిగట్ల రోడ్డు వద్ద 45 ఏళ్ల క్రితం వేసిన తాగునీటి పైప్‌లైన్ పదే పదే లీకేజీ కావడంతో పాత పైప్‌లైన్ తొలగించి కొత్త పైప్‌లైన్ వేసేందుకు భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు నీటి కొరతతో ఇబ్బందులు పడకుండా దెబ్బతిన్న పైప్ లైన్ స్థానంలో కొత్త పైప్‌లైన్ వేసేందుకే పనులు ప్రారంభించామన్నారు. పనుల్లో జాప్యం జగరకుండా వేగవంతంగా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆశీస్సులతో, శాప్ రాష్ట్ర చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి సహకారంతో రూ.40 లక్షలతో 2. 2 కిలో మీటర్ల వరకు పైప్‌లైన్ 10 రోజుల్లోపు పూర్తి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏఈ భాను ప్రతాప్, కౌన్సిలరు చాంద్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు గోవిందరెడ్డి, ఉపేంద్రారెడ్డి, రామకృష్ణ, రామిరెడ్డి, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల వ్యవస్థ దేశానికే ఆదర్శం

వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థలు దేశానికే ఆదర్శమని మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని జైకిసాన్ పార్కులో 8, 9, 10 సచివాలయాల ఆధ్వర్యంలో వలెంటీర్లకు సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర ఉత్తమ సేవ అవార్డులను కౌన్సిలర్లు అబ్దుల్ రవూఫ్, లాలు ప్రసాద్, శాంతకుమారిలతో కలిసి అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ నబి రసూల్, సచివాలయ ఉదోగ్యులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉస్మాన్‌బేగ్, సన్న అబ్దుల్లా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు, ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు



మోతుకూరులో వలంటీర్లను సత్కరిస్తున్న ఎంపీపీ,



ముచ్చుమర్రిలో వలంటీర్‌ను సన్మానిస్తున్న ఎంపీడీఓ ,



ప్రశంస పత్రాలు చూపుతున్న దుద్యాల వలంటీర్లు

వెలుగోడు: ప్రజలకు, ప్రభుత్వానికి వారధులుగా వలంటీర్ల సేవలందిస్తున్నారని ఎంపీపీ లాలం రమేష్ అన్నారు. గురువారం మోత్కూరు సచివాలయంలో మాధవరం, తిమ్మనపల్లె, మోతుకూరు గ్రామాల్లో పని చేస్తున్న 19 మంది వలంటీర్లను సత్కరించారు. ఎంపీపీ మాట్లాడుతూ..అవినీతి రహిత పరిపాలన అందించడంలో భాగంగా దళారుల ప్రమేయం లేకుండా సంక్షేమ పథకాలను ప్రజలకు చేరవేయడంలో వలంటీర్లు కీలక భూమిక పోషిస్తున్నారన్నారు. వారి విశేష సేవలు గుర్తించిన ప్రభుత్వం సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర అనే కేటగిరీలుగా విభజించి వారికి ప్రోత్సాహకాలు అందించడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఎం.ఈశ్వరమ్మ, నాయకులు ముడియం సుధాకర్ రెడ్డి, సచివాలయం కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, మాధవరం శ్రీనివాసులు, తిమ్మనపల్లి సుధాకర్ రెడ్డి, రామలింగారెడ్డి పాల్గొన్నారు.

బోయరేవుల గ్రామంలో..

బోయరేవుల గ్రామంలో సర్పంచ్ నాగనంది పెద్ద స్వామన్న ఆధ్వర్యంలో వలంటీర్లను సన్మానించారు. నాగనంది బాలకృష్ణకు సేవా వజ్ర, జి.గణేష్ కుమార్‌కు సేవా రత్న, మిగతా వాలంటీర్లకు సేవా మిత్ర అవార్డులతో సత్కరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి చౌదయ్య, వీఆర్వో మహబూబ్ బాషా పాల్గొన్నారు.

వలంటీర్లు సేవలు స్ఫూర్తిదాయకం

నందికొట్కూరు: ప్రజలకు, ప్రభుత్వానికి వారధిగా వలంటీర్లు అందిస్తున్న సేవలు స్ఫర్తిదాయకమని పగిడ్యాల ఎంపీడీఓ వెంకటరమణ, కొత్త ముచ్చుమరి గ్రామ సర్పంచు రాధమ్మ, పాత ముచ్చుమర్రి గ్రామ సర్పంచు ఆంజనేయులు అన్నారు. గురువారం పగిడ్యాల మండల పరిధిలోని కొత్త, పాత ముచ్చుమర్రి గ్రామాల్లో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ కళావతమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలు మరవలేనివి

కొత్తపల్లి: గ్రామ వలంటీర్లు ప్రజలకు చేస్తున్న సేవలు మరవలేనివని ఎంపీటీసీ నంద్యాల రమిజాబీ, పంచాయతీ కార్యదర్శి అనుష అన్నారు. గురువారం మండలంలోని దుద్యాల గ్రామంలో సచివాలయ ఆవరణలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా ఉత్తమ సేవలు అందించినందుకు గాను వలంటీర్లకు ప్రశంస పత్రాలు, నగదు బహుమతి అందించారు.

ప్రజలకు ప్రభుత్వానికి వారధులు వలంటీర్లు

మిడుతూరు: ప్రజలకు, ప్రభుత్వానికి సంక్షేమపథకాల అందించడంలో వలంటీర్లు వారధుల్లాంటి వారని సింగిల్‌విండో చైర్మన్ నాగతులసి రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని చౌట్కూరు, నాగలూటీ సచివాలయాల పరిధిలో వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచు ఉషారాణి, పైపాలెం సర్పంచు రామచంద్రుడు, వైస్ ఎంపీపీ నబిరసూల్, చౌట్కూరు గ్రామ ఉపసర్పంచు మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

కౌలుగుర్తింపు కార్డు తప్పనిసరి



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ బి.ఆంజనేయ

కొత్తపల్లి: ప్రతి కౌలు రైతుకు తప్పనిసరిగా కౌలుగుర్తింపు కార్డు ఉండాలని వ్యవసాయ సహాయ సంచాలకులు బి.ఆంజనేయ అన్నారు. మండలంలోని శివపురం, గోకవరం గ్రామాల ఆర్‌బీకేల్లో రైతులకు ఏఓ మహేష్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ కౌలురైతులకు రైతుభరోసా, ఇన్పుట్ సబ్సిడీ, ఇన్సురెన్స్, సున్నావడ్డీ రుణాలు వంటి పథకాలు అందాలంటే తప్పనిసరిగా కౌలుకార్డు (పంటసాగు ధ్రువీకరణ పత్రం) తీసుకోవాలన్నారు. ఈ కార్డును కౌలు రైతు ప్రతి ఏటా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ వెంటకనారాయణ, వీఆర్వో బాబు మియా, కో-ఆప్షన్ సభ్యుడు మహమ్మద్ గౌస్, ఎంపీటీసీ పి.శివన్న తదితరులు పాల్గొన్నారు.

మహానంది: పొలాలు కౌలుకు తీసుకొని పంటలు సాగు చేసే ప్రతి రైతు కౌలుకార్డులు తీసుకోవాలని మహానంది తహసీల్దార్ జనార్దన్‌శెట్టి తెలిపారు. బొల్లవరం, బుక్కాపురం గ్రామాల్లో గురువారం రైతుభరోసా కేంద్రాల్లో కౌలురైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తహసీల్దార్ జనార్దన్‌శెట్టి మాట్లాడుతూ కౌలుకార్డులు తీసుకోవడం ద్వారా రైతులకు అందాల్సిన ప్రయోజనాలు అందుతాయన్నారు. కౌలుకార్డుల పత్రాల కాలపరిమితి 11నెలలు ఉంటుందన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి, సర్పంచ్ వరలక్ష్మమ్మ పాల్గొన్నారు.

బీమా సాయం అందజేత

మిడుతూరు: మండల పరిధిలోని సుంకేసుల గ్రామానికి చెందిన ఏసేపు అనేవ్యక్తి బుధవారం గుండెపోటుతో మృతిచెందాడు. వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద నామిని దానమ్మకు రూ.10వేలను గ్రామసర్పంచు ఇందిరమ్మ గురువారం అందజేశారు. సహజమరణం కింద రావాల్సిన మిగతా డబ్బు త్వరలో బ్యాంకు ఖాతాలో జమ అవుతుందన్నారు.

భూముల వేలంలో పెరిగిన ఆదాయం

మహానంది: బండిఆత్మకూరు మండలంలోని పార్నపల్లె, ఓంకారం క్షేత్రాల్లోని దేవస్థానాలకు చెందిన భూముల కౌలువేలాల ద్వారా అదనపు ఆదాయం లభించినట్లు ఈఓ నాగప్రసాద్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పార్నపల్లెలోని శ్రీ ఆంజనేయస్వామి, వేణుగోపాల స్వామి దేవస్థానానికి చెందిన 52.20ఎకరాల భూమికి వేలంపాటలో గతేడాది రూ. 7.51లక్షలు రాగా ఈ ఏడాది రూ. 1.01లక్షలు వచ్చిందన్నారు. దీంతో రూ. 2.62లక్షలు పెరిగిందని చెప్పారు. అలాగే వీరభద్రస్వామి ఆలయానికి చెందిన 23.26సెంట్ల భూమికి గత ఏడాది రూ.4,46,000 రాగా ప్రస్తుతం రూ. 6.11లక్షలు వచ్చినట్లు చెప్పారు. ఓంకారం క్షేత్రంలో కొలువైన శ్రీ ఓంకార సిద్ధేశ్వర స్వామి ఆలయానికి చెందిన భూములు 2.50 ఎకరాలకు క్రితం ఏడాది రూ. 32వేలు రాగా, ఈ సారు రూ. 49వేలు వచ్చినట్లు వివరించారు.

చిన్నారులకు కరాటే శిక్షణ



చిన్నారులతో కరాటే శిక్షకులు

ఆత్మకూరు: వేసవు సెలవుల్లో చిన్నారులకు కరాటే శిక్షణ ఇవ్వడం ఎంతో సంతోషంగా ఉందని కరాటే శిక్షణా నిర్వహకులు కాజాహుస్సేన్, స్వామన్న, అన్నమయ్య జిల్లా ఎస్ఐ జాఫర్ అన్నారు. పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో చిన్నారులకు నిర్వహిస్తున్న కరాటే శిక్షణా కార్యక్రమాన్ని గురువారం వీరు పరిశీలించారు. వారు మాట్లాడుతూ చిన్నారులు వేసవిలో ఎక్కడ పడితే అక్కడ ఎండల్లో తిరగకుండా స్టేడియంలో కరాటే శిక్షణలో పాల్గొనడం సంతోషకరమన్నారు. పిల్లలు కరాటే నేర్చుకోవడం వలన శారీరకంగా ఫిట్‌గా కావడమే కాకుండా రోగనిరోధక శక్తి పెరుగుతుందని చెప్పారు. అనంతరం చిన్నారులకు బిస్కెట్లు, పాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఈటీ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

గుంతకందాలలో డయేరియా కలకలం



గ్రామస్తులతో మాట్లాడుతున్న వైద్యసిబ్బంది

వెలుగోడు: మండల పరిధిలోని గుంతకందాల గ్రామంలో డయేరియా కలకలం రేపింది. గ్రామానికి చెందిన పలువురు వాంతులు, విరేచనాలతో బాధపడుతుండటంతో వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది అప్రమత్తమయ్యారు. మెడికల్ ఆఫీసర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. 8 మంది విరేచనాలతో బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. ఇటీవల వేరే ప్రాంతానికి పెళ్లికి వెళ్లి రావడంతో డయేరియా వచ్చి ఉంటుందని అనుమానిస్తున్నారు. ఎండతీవ్రత అధికంగా ఉండటం కూడా మరో కారణం కావచ్చు అనే అభిప్రాయంకూడా వ్యక్తమవుతోంది. గ్రామంలో నీటి నమూనాలు సేకరించి టెస్టింగ్ కోసం ల్యాబ్‌కు పంపించినట్లు వైద్యాధికారి వంశీకృష్ణ తెలిపారు. గ్రామంలో ఐదు రోజుల పాటు మెడికల్ క్యాంపు కొనసాగుతుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యాధికారి వెల్లడించారు. గురువారం రాత్రి డీఎంహెచ్ఓ వెంకటరమణ వెలుగోడు సీహెచ్‌సీని సందర్శించి, వైద్యసిబ్బందితో పరిస్థితిని ఆరాతీశారు.


కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు



నీట మునిగిన వ్యక్తి కోసం ఎదురుచూస్తున్న బంధువులు

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం డ్యామ్ దిగువ భాగంలోని లింగాలగట్టు వద్ద నీటిలో మునిగి ప్రకాశం జిల్లా ఎర్రగొండపాలెం మండలం, గుడిజేపల్లి గ్రామానికి కందుల వెంకటేశ్వరరెడ్డి(40) గురువారం సాయంత్రం గల్లంతయ్యాడు. గుంజూపల్లి నుంచి బంధువులు, స్నేహితులతో కలిసి ఒక ప్రైవేట్ వాహనంలో బుధవారం శ్రీశైలం వచ్చారు. శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామి వార్లను దర్శించుకున్నారు. గురువారం ఉదయ తెలంగాణ ప్రాంతంలోని మద్దిమడుగు ఆంజనేయ స్వామిని దర్శించుకుని తిరుగు ప్రయాణంలో లింగాలగట్టు వద్ద కృష్ణానదిలో స్నానమాచరించడానికి దిగారు. వెంకటేశ్వరరెడ్డి నదిలో ఈత కొడుతూ ఉండగా ప్రవాహానికి నీటమునిగిపోయాడు. ప్రమాదం జరిగిన ప్రాంతం తెలంగాణ రాష్ట్రం దోమలపెంట మండలం పరిధిలో ఉండడంతో తెలంగాణ పోలీసులు కేసు నమోదు చేసుకుని గల్లంతైన వ్యక్తికోసం గాలిస్తున్నారు.

భానుడి ప్రతాపం



ఇక్కడ సేదతీరుదాం.. అబ్బీపురం వద్ద మండుటెండకు చెట్టు కింద సేదతీరుతున్న పొట్టేళ్ల మంద



దాహమేస్తోంది.. మంచినీటి కోసం వానరం కష్టాలు

ఉదయం అయ్యిందంటే చాలు వస్తూనే సూర్యభగవానుడు తన ప్రతాపం చూపుతున్నాడు. సాధారణంగా ఉదయం వేళలో సూర్యుడు శాంతంగా ఉంటాడు. అయితే ఈ వేసవిలో మాత్రం ఉదయిస్తూనే ఉక్కపోతకు గురిచేస్తుండటంతో ప్రజలతో పాటు మూగ జీవాలు సైతం అల్లాడిపోతున్నాయి. మధ్యాహ్నమయితే ఇంటి నుంచి బయటికి వచ్చేందుకు ప్రజలు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. గతంలో 38 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత అంటేనే అమ్మో...అనే వాళ్లం. ప్రస్తుతం 43 నుంచి 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో ఉక్కిరిబిక్కిరి అవ్వాల్సి వస్తుంది.
–మహానంది



ఆహా.. చల్లగా ఉంది.. చేతిబోరు కింద నీళ్లు పోసుకుంటూ వేసవితాపం తీర్చుకుంటున్న చిన్నారులు



వానకే కాదు
ఈ ఎండకు
గొడుగు అవసరమే
అమ్మో

వీఆర్‌ఓపై చర్యలు తీసుకోండి

మహానంది: నకిలీ సర్టిఫికెట్లు సృష్టించుకుని ఉద్యోగం సంపాదించుకున్న వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలని బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరుకు చెందిన బోయ.వెంకటేశ్వర్లు గురువారం బండిఆత్మకూరులో విలేకరుల ఎదుట వాపోయాడు. ఆయన మాట్లాడుతూ కాకనూరు వీఆర్‌ఓగా పనిచేస్తున్న తలారి చిన్న వెంకటేశ్వర్లు స్వయంగా తనకు సోదరుడు అని, తనకు చెందిన ఆధార్‌కార్డు, విద్యార్హత సర్టిఫికెట్లు, సంతకాలు ఫోర్జరీ చేసుకుని బోయ వెంకటేశ్వర్లుగా చలామణి అవుతున్నాడని ఆరోపించారు. చర్యలు తీసుకోలేని పక్షంలో నంద్యాల కలెక్టర్ కార్యాలయం వద్ద ఆమరణ దీక్ష చేస్తానని వెంకటేశ్వర్లు తెలిపారు.

అలుగుతో సీమ సస్యశ్యామలం

నంద్యాల(అర్బన్): సిద్దేశ్వరం అలుగు ఏర్పాటుతోనే రాయలసీమ సస్యశ్యామలమవుతుందని రాలయసీమ సాగునీటి సాధన సమితి ఉపాధ్యక్షుడు వైఎస్ రెడ్డి అన్నారు. ఈనెల 31వ తేదీన చేపట్టనున్న జలజాగారణ దీక్ష విజయవంతం చేయాలని గురువారం మండలంలోని బిల్లలాపురం, కొత్తపల్లె, పులిమద్ది, మునగాల గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు.